

# శుభవాస్తు


సుద్దాల సుధాకర్ తేజ
suddalavasthu@gmail.com
Cell: 7993467678




**■ ప్రతి ఇంటికీ నాలుగు దిక్కులకు.. నాలుగు ద్వారాలు తప్పకుండా పెట్టాలా?**

**- కె. మంజు,** మూసాపేట.



ప్రతి ఇంటికి ఆయా వీధులను బట్టి ఆయా సింహద్వారాలు తప్పకుండా వస్తాయి. ఇక ద్వారాలు నాలుగు దిశలకూ తప్పకుండా పెట్టాలి అనేది సామాన్య గృహాలకు అవసరం లేదు. సచివాలయం, హోటళ్లు, పెళ్లి మండపాలకు అవసరం పడతాయి. ఏ దిశకు ఇల్లు కట్టినా.. దానికి వచ్చే సింహద్వారాలతోపాటు ఉత్తరం – తూర్పు ద్వారాలు తప్పకుండా ఉండాల్సిందే! పడమర ద్వారం సింహద్వారం వచ్చింది కాబట్టి, తూర్పు ద్వారం లేకున్నా ఫర్వాలేదు అనుకోవద్దు. తప్పకుండా ఉండాలి. ఒక సింహద్వారం – ఒక బహిర్ ద్వారం.. రెండూ తప్పక అవసరం అవుతాయి. ద్వారాలు ఇంటి విభజనను బట్టి పెరుగుతాయి. తగ్గుతాయి. అయితే, బయటికి వెళ్లే ద్వారాలు చాలా ప్రధానమైనవి (ఆగమన – నిష్క్రమణ ద్వారాలు). నాలుగు వైపులా ద్వారాలు తప్పనిసరి కాదు. క్రాస్ వెంటిలేషన్ కోసం వరుస ద్వారాలు పెట్టడం చాలా శ్రేయస్కరం. ద్వారాలు లోపలి గదులకు పెట్టేటప్పుడు నడకలు వక్రంగా పోకుండా సరళరేఖను సూచిస్తూ, ఉచ్ఛమైన దిశలు తెలుసుకొని పెట్టుకోవాలి. ఇంటి మొత్తానికి కలిపి చూసి, ఉన్నత దిశలో ద్వారాలు స్థిరపరుచుకోవడం చాలా ముఖ్యం.



**■ మాది నాలుగు అంతస్తుల భవనం. ఒకటి మాకు, ఇంకోటి కామన్ లిఫ్ట్ కావాలి. ఏది, ఎక్కడ, ఎలా పెట్టాలి?**

**- బి. కృష్ణహరి,** సైదాబాద్.

ఇంట్లో రెండు లిఫ్టులు కావాలంటే.. ఇంటి బయట ఆగ్నేయంలో కామన్ లిఫ్ట్ పెట్టుకోవచ్చు. అలాగే, ఉత్తర – వాయవ్యంలో కూడా కామన్ లిఫ్ట్ పెట్టొచ్చు. మీకు తూర్పు బాల్కనీ లేనట్టుంది. అది మీ ప్లానులో అర్థమవుతున్నది. తూర్పు – ఆగ్నేయం లిఫ్ట్ ప్లాన్ చేసినట్లు అయితే.. తూర్పు బాల్కనీని లిఫ్ట్ కొలతను అనుసరించి, నాలుగు లేదా ఐదు అడుగులు తూర్పు పెంచండి. అందు లోంచి నడిచి, ఇంటి తూర్పు – ఈశాన్యం గుండా వెళ్లేలా ముందుగా ఇంటిని సవరించుకోవాలి. ఇంటి లోపల మీకు హాలు ఉంది కాబట్టి, దక్షిణంలో మెట్ల మధ్యన లిఫ్ట్ పెట్టండి. అది చక్కగా కుదురుతుంది. ఆ విధంగా మీకు రెండు లిఫ్టులు వస్తాయి. కానీ, మీరు ప్లానులో చూపినట్లుగా ఉత్తరం ఇంటిని కట్‌చేసి పెట్టకూడదు. అది ఇంట్లో స్త్రీలమీద దుష్ప్రభావం చూపుతుంది. జాగ్రత్తగా ప్లాన్ చేసుకోండి.

**■ దక్షిణ - ఆగ్నేయంలో వీధి ఎదురుగా వస్తే.. అది 'పోటు' అవుతుందా? అప్పుడు ఆగ్నేయం గేటు కట్‌చేసి కట్టాలా? వివరించి చెప్పండి.**

**- బి. మారుతి,** సైదాబాద్.



కొందరు ఆమూలాగ్రం శాస్త్ర ప్రయోజనం ఏమిటో తెలియకుండా.. వారికి తెలిసిందే మహాశాస్త్రంగా భావించి చెబుతూ ఉంటారు. దక్షిణ – ఆగ్నేయంలో వీధి ఎదురుగా వస్తే.. అది 'పోటు' కాదు. 'వీధి చూపు' అవుతుంది. అది శుభదాయకం. దానితో ఆ నిర్మాణ యజమానులకు కీర్తి ప్రతిష్ఠలు కలుగుతాయి. అలా వీధిచూపు వచ్చినప్పుడు దక్షిణం – ఆగ్నేయం గేటు పెట్టుకోవచ్చు. దానిని కట్‌చేసి ఈశాన్యం పెంచాలనుకోవడం, అసలు అటువైపు గేటు మొత్తమే వద్దు అనడం సరైన అభిప్రాయం కాదు. తద్వారా నాలుగు మూలలు సమకోణంగా, దీర్ఘచతురస్రంగా ఉన్న స్థలం కాస్తా.. ఐదు కోణాలుగా మారుతుంది. ఉన్నది ఉన్నట్లు వాడండి. దోషం లేదు. తూర్పు – ఆగ్నేయం వీధి ఎదురుగా వస్తే.. అది 'పోటు' అవుతుంది. పెద్ద దోషం. దక్షిణ – ఆగ్నేయం అలాగే, దానికి అభిముఖంగా ఉత్తర – ఈశాన్యం వీధులు పడినప్పుడు.. అవి రెండూ శుభదాయకాలే అన్న విషయం మరువకూడదు.

**■ డ్రెస్సింగ్ రూమును డబుల్ హైట్ చేసి వాడుకోవచ్చా?**

**- బి. హేమలత,** చేవెళ్ల.



నేడు బెడ్ రూముకన్నా.. డ్రెస్సింగ్ రూమ్ ఎక్కువ ప్రాధాన్యత సంతరించుకుంటున్నది. అది దోషం కాదు. కానీ, ఒక విశాలమైన పడకగదిని నిర్మించి, దానిలో భాగంగా డ్రెస్సింగ్ రూమును పెట్టినప్పుడు.. స్థలం కోసం దానిని డబుల్ హైట్ చేయడం మంచిదికాదు. ఇంటి యజమాని పడకగది ఎత్తులోనే.. అతని వాడకం గది అంతా ఉండాలి. ఒక ఇంటిలో లగ్జరీగా పడక గది రావాలి అంటే.. దక్షిణ భాగం మొత్తం లేదా పడమర భాగం మొత్తం పడక గదిగా మార్చుకొని, నైరుతి భాగం బెడ్ వచ్చేలా ప్లాన్ చేసి, సపరేటుగా డ్రెస్సింగ్ రూమ్ ప్లాన్ చేయవచ్చు. అది ఎంతో అనుకూలంగా ఉంటుంది. డ్రెస్సింగ్ గదికూడా విశాలంగా ఏర్పాటు చేసుకోవచ్చు. ఇంటి లోపలిభాగం పొడవు – వెడల్పు – ఎత్తులలో మార్పులు ఉండకుండా చూడాలి. అప్పుడు దాని అంతరంగ శక్తి ఊర్జ గొప్పగా ఉంటుంది.

**మీ ప్రశ్నలు పంపాల్సిన చిరునామా**

'బతుకమ్మ', నమస్తే తెలంగాణ దినపత్రిక,
ఇంటి.నం: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం.
రోడ్ నం: 10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034.